క్లుప్తంగా

కొండా విశ్వేశ్వర్‌రెడ్డి గెలవాలని పూజలు



ఆలయంలో మాట్లాడుతున్న కృష్ణగౌడ్, తదితరులు

చేవెళ్ల: లోక్‌సభ ఎన్నికల్లో కేంద్రంలో మళ్లీ బీజేపీ ప్రభుత్వం నరేంద్ర మోదీయే రావాలని, చేవెళ్లలో ఎంపీగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అత్యధిక మెజార్టీతో గెలవాలని రామేశ్వరం జ్యోతిర్లింగ ఆలయంలో చేవెళ్ల బీజేపీ మండల ఉపాధ్యక్షుడు కృష్ణగౌడ్, బీజేపీ లీగల్ టీమ్ సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. గురువారం తమిళనాడులోని రామేశ్వరం జ్యోతిర్లింగ ఆలయంలో వారు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకే అధిక సీట్లు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలవాలని కోరుతూ ప్రత్యేక పూజలు చేసినట్లు తెలిపారు. మోదీ మరోసారి ప్రధానిగా ఎన్నికై దేశాభివృద్ధికి కృషి చేయాలన్నారు.

రైతులకు సహకార సంఘం అండ



రైతు కుటుంబానికి చెక్కు అందజేస్తున్న చైర్మన్ శేఖర్‌రెడ్డి

షాబాద్: రైతులకు సహకార సంఘం అండగా ఉంటుందని షాబాద్ సహకార సంఘం చైర్మన్ చల్లా శేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సహకార సంఘం బ్యాంకులో ఏట్ల ఎర్రవల్లి గ్రామానికి చెందిన రైతు అన్వర్‌ఖాన్ మృతి చెందడంతో బాధిత కుటుంబానికి రూ.11వేల ఆర్థిక సాయం చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సహకార సంఘంలో మెంబర్‌షిప్ ఉన్న రైతులు మృతి చెందితే ఆ కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్నామన్నారు. రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటుందని సూచించారు. కార్యక్రమంలో సహకార సంఘం సీఈఓ శివకుమార్‌రెడ్డి, డైరెక్టర్ పీసరి రాజేశ్వర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు రాములు, కిష్టయ్య, తదితరులున్నారు.

జీవాలకు టీకాలు వేయించాలి



కుమ్మరిగూడలో గొర్రెలకు టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

షాబాద్: మూగజీవాల ఆరోగ్యంపై రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని షాబాద్, రేగడిదోస్వాడ పశువైద్యాధికారులు స్రవంతి, చంద్రశేఖర్‌రెడ్డిలు పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని కుమ్మరిగూడ గ్రామంలో మూగజీవాలకు చిటుక వ్యాధి నివారణ టీకాల వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గొర్రెలు, మేకలకు చిటుక వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని, జీవాల ఆరోగ్యంపై రైతులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. గొర్రెలు, మేకలు అనారోగ్యానికి గురికాకుండా ప్రభుత్వం ఏడాదిలో రెండు విడతలు చిటుక వ్యాధి నివారణ టీకాలు వేసే కార్యక్రమం నిర్వహిస్తుందని, గ్రామాల్లో రైతులు అందుబాటులో ఉండి తమ జీవాలకు టీకాలు వేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

కార్మికుల సంక్షేమానికి నిరంతరం కృషి



నాగర్‌కుంటలో సీఐటీయూ జెండా ఆవిష్కరిస్తున్న దేవేందర్, తదితరులు

షాబాద్: కార్మికుల సంక్షేమానికి సీఐటీయూ నిరంతరం కృషి చేస్తుందని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ పేర్కొన్నారు. సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్ (సీఐటీయూ) ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం మండల పరిధిలోని కేసారం, నాగర్‌కుంట గ్రామాల్లో జెండాను ఆవిష్కరించారు. సీఐటీయూ కార్మికుల సంక్షేమానికి కట్టుబడి అనేక పోరాటాలు చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పి కొడదామని సూచించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకులు సత్తయ్య, నరసింహా, సీహెచ్ నరసింహా, రమేశ్, రాంచంద్రయ్య, మల్లయ్య, కవిత, సుజాత, అంజయ్య తదితరులున్నారు.

అమ్మ ఆదర్శంగా నిలిచేలా..

- చేవెళ్ల మండలంలో 20 పాఠశాలలు ఎంపిక
- మౌలిక సదుపాయాల కల్పనకు అధికారుల చర్యలు
- వేగంగా జరుగుతున్న అభివృద్ధి పనులు



గొల్లపల్లి పాఠశాలలో విద్యుత్ కనెక్షన్ పనులను పరిశీలిస్తున్న అధికారులు

చేవెళ్ల: విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసేందుకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల పేరుతో నిధులు విడుదల చేసి అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. విద్యాసంవత్సరం ప్రారంభం జూన్ 12లోగా వసతులు కల్పించాలని విద్యాశాఖ లక్ష్యం నిర్దేశించింది. ఈ దిశగా అధికారులు క్షేత్రస్థాయిలో కసరత్తు చేస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాలతో ఎంపిక చేసిన పాఠశాలల్లో వేగంగా పనులు ప్రారంభించి అమ్మ ఆదర్శ పాఠశాలలను కొత్త అందాలతో విద్యార్థులకు స్వాగతం పలికేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఆదర్శ కమిటీ ప్రతినిధులు పనులపై దృష్టి పెట్టారు. ప్రతి మండలం నుంచి గతంలో 'మన ఊరు–మన బడి' కింద ఎంపికైన పాఠశాలల్లో కొంత అభివృద్ధి జరగగా మిగిలిన పాఠశాలల్లో ఈ ప్రభుత్వంలో అమ్మ ఆదర్శ పాఠశాలలుగా ఎంపిక చేసి అభివృద్ధి చేస్తోంది. చేవెళ్ల మండలంలో 20 పాఠశాలలను మొదటి విడుతలో ఎంపిక చేసింది. మిగిలిన పాఠశాలలను కూడా రెండో విడుతలో ఎంపిక చేసి అన్ని పాఠశాలల్లో వసతులు, సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని అధికారులు చెబుతున్నారు. ప్రతి పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు లక్ష రూపాయల నిధులు అందిస్తోంది. ప్రస్తుతం మొదటి విడుతగా ప్రతి పాఠశాలకు 25వేల రూపాయల నిధులను విడుదల చేసింది. పనులను బట్టి మిగతా నిధులు విడుదల చేస్తారని పేర్కొంటున్నారు. మండలంలోని మండల విద్యాధికారి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, పంచాయతీరాజ్ డీఈఈ, ఏఈ, ఎంఎస్‌ఓ, హెచ్‌ఎంలతో అధికారులు మండలంలోని ఈ అమ్మ ఆదర్శ పాఠశాలల నిర్వహణను పర్యవేక్షించి పనులు పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఉన్నతాధికారులు డీఈఓ, కలెక్టర్‌లు సైతం పాఠశాలల అభివృద్ధి పనులను ఎప్పటికప్పుడూ పర్యవేక్షిస్తున్నారు.

ఎంపికైన పాఠశాలలు ఇవే..

మండలంలోని ప్రాథమిక పాఠశాలలు హస్తేపూర్, గొల్లపల్లి, దేవునిఎర్రవల్లి, ఇబ్రహీంపల్లి, దేవరంపల్లి, అల్లవాడ, కేసారం, పలుగుగుట్ట, ప్రాథమికోన్నత పాఠశాలలు న్యాలట, రామన్నగూడ, ఎన్కేపల్లి, రావులపల్లి, బస్తేపూర్, మీర్జాగూడ, రేగడిఘనాపూర్, పామెన, ఉన్నత పాఠశాలలైన ఆలూరు, కౌకుంట్ల, చనువెళ్లి, ఖానాపూర్ పాఠశాలలను అమ్మ ఆదర్శ పాఠశాలల కింది ఎంపిక చేసి వీటిని అభివృద్ధి చేస్తోంది. వీటిలో మౌలిక వసతులు, చిన్న చిన్న మరమ్మతులు, విద్యుత్ కనెక్షన్‌లు తదితర వాటిని చేయించి పాఠశాలలు ప్రారంభించేనాటికి సిద్ధం చేసేందుకు చర్యలు చేపట్టారు.

అన్ని పాఠశాలల్లో వేగంగా పనులు



మండలంలో 20 పాఠశాలలు ఎంపికయ్యాయి. ఈ పాఠశాలల్లో ఉన్న సమస్యలను గుర్తించి నివేదికలను పంపించామని, దాని ప్రకారం ఆయా పాఠశాలల్లో ఉన్న సమస్యలకు అమ్మ ఆదర్శ పాఠశాల నిధుల కింద మరమ్మతులు చేస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికే ఈ పనులు చేసేందుకు కొంత నిధులు విడుదల చేసిందని పనులు ప్రారంభించి వాటిని పాఠశాలల పునఃప్రారంభించే నాటికి పూర్తిచేసే లక్ష్యంతో ముందుకెళ్తున్నాం. మండలంలో ఎంపికైన అన్నీ పాఠశాలల్లో పనులు జరుగుతున్నాయి. ఎప్పటికప్పుడూ ఈ పనులను మండలస్థాయి అధికారుల టీమ్ పర్యవేక్షిస్తోంది. మౌలిక వసతుల కల్పనతో ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభించే నాటికి సిద్ధం కానున్నాయి.

–సయ్యద్ అక్బర్, ఎంఈఓ, చేవెళ్ల



దేవునిఎర్రవల్లి ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న ఫ్లోరింగ్ పనులు

అమ్మ ఆదర్శ కమిటీల బాధ్యతలు

మండలంలో ఎంపిక చేసిన ఆయా గ్రామాల్లోని పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా మౌలిక సుదుపాయాల కల్పన, బాలికల మరుగుదొడ్ల నిర్మాణం, తాగునీటి సౌకర్యాలు, పాఠశాలల్లోని చిన్న చిన్న మరమ్మతులు చేయటం, గతంలో ఉన్న మరుగుదొడ్లకు మరమ్మతులు, తరగతి గదుల్లో విద్యుద్దీకరణ, పాఠశాల ఆవరణ, గదుల్లో పారిశుద్ధ్య నిర్వహణ, పాఠశాలల వద్ద సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు, విద్యార్థులకు యూనిఫాంలు అందించే విధంగా మహిళా సంఘాలకు కుట్టేందుకు అప్పగించి అందించేలా చూడటం వంటి బాధ్యతలు ఉంటాయని అధికారులు పేర్కొన్నారు.

విద్యార్థులకు అసౌకర్యం లేకుండా..

విద్యా సంవత్సరం పారంభమయ్యాక విద్యార్థులకు ఎలాంటి సమస్యలు లేకుండా విద్యాశాఖ అధికారులు మౌలిక వసతుల కల్పనకు పనులు చేయిస్తున్నారు. వేసవి సెలవుల్లో ఈ పనులను వేగవంతం చేశారు. గతంలో మన ఊరు–మన బడి పథకం కింద ఎంపికైన పాఠశాలల్లో దాదాపు మరమ్మతులు పూర్తయ్యాయి.

రోడ్డు పక్కన గుంత పూడ్చివేత



పైపులైన్ గుంతను పూడ్చుతున్న పంచాయతీ సిబ్బంది

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని హిమాయత్‌నగర్ సాయిబాబా దేవాలయం సమీపంలో వారంరోజుల క్రితం మంచినీటి పైపులైన్ లీకేజీతో గుంత తీశారు. లీకేజీకి మరమ్మతులు పూర్తిచేసి గుంత పూడ్చడంలో నిర్లక్ష్యం వహించడంతో 'మరమ్మతులు చేశారు..పూడ్చడం మరిచారు' అనే శీర్షికతో గురువారం సాక్షి పత్రికలో ప్రచురితమైన కథనానికి హిమాయత్‌నగర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణి స్పందించారు. ఉదయం 9 గంటలకే పంచాయతీ సిబ్బందితో రోడ్డు పక్కన తీసిన గుంతను పూడ్చి వేయించారు. ఈ సందర్భంగా హిమాయత్‌నగర్ గ్రామస్తులు, వాహనదారులు సాక్షి పత్రికకు కృతజ్ఞతలు తెలిపారు. పత్రికలో వచ్చిన వార్తను వెంటనే స్పందించడం హర్షణీయమన్నారు.

హక్కుల సాధనకై ఐక్య ఉద్యమాలు: సీఐటీయూ



కేక్ కట్ చేస్తున్న రాజు, కార్మికులు

షాద్‌నగర్: హక్కుల సాధనకు ఐక్య ఉద్యమాలు చేయాల్సిన సమయం ఆసన్నమైందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు కార్మికులకు పిలుపునిచ్చారు. సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్ (సీఐటీయూ) ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం షాద్‌నగర్ మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాజు మాట్లాడుతూ... కార్మికులకు పనికి సరిపడా వేతనాలు లేకపోవడంతో ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారని.. వారి సంక్షేమానికి కృషి చేయాల్సిన ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తులకు వత్తాసు పలుకుతున్నాయని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పి కొడదామన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్ నాయక్, మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు యాదయ్య, రాజు, జంగయ్య, వెంకటేశ్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



ఎమ్మెల్యేను కలిసిన బ్రాహ్మణ సంఘం నాయకులు

షాద్‌నగర్: బ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం షాద్‌నగర్ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ అధ్యక్షుడు రామ సత్యనారాయణ, అర్చక పురోహిత సమాఖ్య అధ్యక్షుడు రవిశర్మ ఆధ్వర్యంలో పలువురు సంఘం నాయకులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలను సంఘం నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సమాజంలో బ్రాహ్మణులకు ప్రత్యేకమైన గుర్తింపు ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బ్రాహ్మణుల సంక్షేమానికి పూర్తిగా కట్టుబడి ఉందని పేర్కొన్నారు. బ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించే విధంగా కృషి చేస్తానన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో రాజగోపాల్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు



చేవెళ్ల ఆదర్శ పాఠశాల విద్యార్థినిని సన్మానిస్తున్న కలెక్టర్ శశాంక

చేవెళ్ల: పదిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను జిల్లా కలెక్టర్ శశాంక సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. గురువారం జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 10 జీపీఏ సాధించిన విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు–2024 పేరుతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చేవెళ్లలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో పదిలో 10 జీపీఏ సాధించిన జోత్స్న, సాయిమనోజ్ఞలను కలెక్టర్ శశాంక, జిల్లా విద్యాధికారి సుశీందర్‌కుమార్, పలువురు జిల్లా అధికారుల చేతుల మీదుగా ప్రతిభ పురస్కారాలు అందుకున్నారని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ టీనావతి తెలిపారు. తమ పాఠశాల విద్యార్థులు 10జీపీఏ సాధించి జిల్లాలో తమ పాఠశాల పేరును నిలబెట్టారని విద్యార్థులను ఉపాధ్యాయులందరూ ప్రత్యేకంగా అభినందించారు.

నందిగామ విద్యార్థికి..

నందిగామ: మండల కేంద్రమైన నందిగామలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదిలో విద్యార్థి సమిత్ సింగ్ 10 జీపీఏ సాధించడంతో ప్రతిభ పురస్కారానికి ఎంపికయ్యాడు. దీంతో గురువారం జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ శశాంక చేతుల మీదుగా సమిత్ సింగ్ ప్రతిభ పురస్కారాన్ని అందుకున్నాడు. ఈ సందర్భంగా అతనిని పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

భానుడి భగభగ



అమ్డాపూర్‌లో నిర్మానుష్యంగా మారిన రోడ్డు

మొయినాబాద్‌రూరల్: భానుడి ప్రతాపం మళ్లీ తీవ్రమైంది. రెండురోజులుగా మండలంలో ఎండలు మండిపోతున్నాయి. వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులతో చెదురుమదురుగా ఓ మోస్తారు వర్షాలు ఇటీవల కురిసిన సంగతి తెలిసిందే. దీంతో ఎండల తీవ్రత నుంచి ప్రజలకు కొంత ఉపశమనం లభించింది. రెండుమూడు రోజులుగా భానుడి ప్రతాపం మళ్లీ మొదలు కావడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఎండలు దంచికొడుతుండటంతో వేడిమికి మధ్యాహ్నం వేళ రోడ్లపై జనసంచారం తగ్గిపోయింది. రోహిణి కార్తె ముగిసేవరకు ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుందని చెబుతున్నారు.

'ఉపాధి హామీ' నిర్వీర్యానికి కుట్ర

వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనునాయక్



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

షాద్‌నగర్: జాతీయ ఉపాధి హామీ పథకాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనునాయక్ అన్నారు. జూన్ 10న హైదరాబాద్‌లో ఈజీఎస్ పథకం పరిరక్షణ కోసం నిర్వహించే రాష్ట్ర సదస్సుకు సంబంధించిన కరపత్రాలను గురువారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కాశిరెడ్డిగూడ గ్రామంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో వలసలను నిర్మూలించేందుకు తీసుకొచ్చిన ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేయాలని చూస్తుందని విమర్శించారు. ఈ పథకం రద్దు అయితే ఎంతో మంది నిరుపేదలకు ఉపాధి లేకుండా పోతుందన్నారు. పొట్టకూటి కోసం మళ్లీ వలసలు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంటుందని పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు పనిదినాలు 200 రోజులకు పెంచాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కొలతలు లేకుండా కూలీలకు రోజుకు రూ.600లు చెల్లించాలన్నారు. డిమాండ్ల సాధనకు, ఉపాధి హామీ పథకం పరిరక్షణకు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జూన్ 10న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సుకు ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రాజు, అంజయ్య, వీరయ్య, మంజుల, సువర్ణ, యాదమ్మ, పార్వతమ్మ, అలివేలు, మంగమ్మ, పద్మమ్మ, బుచ్చమ్మ, మాధవి, చెన్నమ్మ, చంద్రమ్మ, దీప, రత్నమ్మ, అంజయ్య పాల్గొన్నారు.

విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు అవసరం

ఏడీఏ రాజారత్నం



కొత్తూరు: అవగాహన కల్పిస్తున్న ఏడీఏ రాజారత్నం

కొత్తూరు: విత్తనాల ఎంపికలో రైతులు సరైన జాగ్రత్తలు పాటించాలని షాద్‌నగర్ డివిజన్ ఏడీఏ రాజారత్నం పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఆయన మండలంలోని మల్లాపూర్‌తండా పంచాయతీ పరిధిలోని రాఘ్యాతండాలో గురువారం రైతులకు విత్తనాల ఎంపిక, పంటల సాగుపై అవగాహన కల్పించారు. దుకాణాల్లో రైతులు కొనుగోలు చేసిన విత్తనాలకు తప్పకుండా రసీదులు తీసుకోవాలని కోరారు. అంతేకాకుండా విత్తనాలను సీల్డు ప్యాకెట్లలోనే కొనుగోలు చేయడంతో పాటు పంటలు పూర్తయ్యే వరకు ప్యాకెట్లను భద్రపరుచుకోవాలన్నారు. ముఖ్యంగా రైతులు ప్రభుత్వ గుర్తింపు పొందిన దుకాణాల్లోనే విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయాలని సూచించారు. నకిలీ విత్తనాలు, అనుమతి లేని ఎరువులు విక్రయించడం నేరమన్నారు. అలాంటి విక్రయాలు జరిగితే రైతులు తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి, స్థానిక నాయకులు రవీందర్ నాయక్, రాజుగౌడ్, దశరథ్‌నాయక్, ఏఈఓ నిఖిత, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడులు

కొందుర్గు: నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడులు పొందవచ్చని వ్యవసాయ విస్తరణ అధికారి రాజేశ్వరి సూచించారు. చౌదరిగూడ మండలంలోని కాస్లాబాద్, ముష్టిపల్లి, ఎదిర, గుర్రంపల్లి గ్రామాల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏఈఓ రాజేశ్వరి మాట్లాడుతూ.. నాసిరకం విత్తనాలు వాడి మోసపోవద్దన్నారు. అధీకృత డీలర్ల వద్దనే విత్తనాలు కొనాలని, విత్తనాలు కొనేముందు విధిగా బిల్లులు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓలు గౌరి, స్వాతి, ప్రియతోపాటు ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

కార్యదర్శులను నియమించేదెన్నడో?

ఇన్‌చార్జి సెక్రటరీల పాలనతో అభివృద్ధి కుంటు



బాకారం గ్రామ పంచాయతీ కార్యాలయం

మొయినాబాద్‌రూరల్: ఆయా గ్రామాల్లో కార్యదర్శులు పూర్తిస్థాయిలో లేకపోవడంతో ఇన్‌చార్జి కార్యదర్శుల పాలనతో అభివృద్ధి నత్తనడకన సాగుతోందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. మొయినాబాద్ మండలంలో బాకారం, అజీజ్‌నగర్ గ్రామాలకు ఇన్‌చార్జి కార్యదర్శుల పాలనతో రోజు తప్పి రోజు అధికారులు పాలన సాగడంతో ప్రజలకు ఇబ్బందిగా మారిందని ఆయా గ్రామాల వాసులు పేర్కొంటున్నారు. అజీజ్‌నగర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి రెడ్డిపల్లికి పూర్తిస్థాయిగా పని చేస్తున్న రంజిత్‌కుమార్ అజీజ్‌నగర్ గ్రామ పంచాయతీకి ఇన్‌చార్జిగా నియమించారు. అదే విధంగా కనకమామిడి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన శ్రీనివాస్‌ను బాకారం గ్రామ పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శిగా ఏర్పాటు చేశారు. అయితే వీరు ఒక రోజు ఒక ఊరిలో, మరొక రోజు మరో ఊరిలో ఉండి పాలన సాగించడంతో ఆయా గ్రామాల ప్రజలకు ఇబ్బందిగా మారుతోందని, పూర్తిస్థాయి పంచాయతీ కార్యదర్శులను ఏర్పాటు చేస్తే ఈ గ్రామాలు మరింత అభివృద్ధి చెందుతాయని చెబుతున్నారు. మొయినాబాద్ మండలంలో 28 గ్రామ పంచాయతీలకు గాను 26 మంది పంచాయతీ కార్యదర్శులు పనిచేస్తున్నారు. మేజర్ గ్రామ పంచాయతీ అయిన అజీజ్‌నగర్‌తో పాటు బాకారం గ్రామ పంచాయతీలకు కార్యదర్శులు ఖాళీగా ఉండడంతో ఇన్‌చార్జి పాలన సాగుతోంది. గత ఎనిమిది నెలల నుంచి ఇన్‌చార్జి పాలనతోనే సతమతమవుతున్నారని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా పూర్తిస్థాయి పంచాయతీ కార్యదర్శులను ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. దీనిపై మండల అభివృద్ధి అధికారి సంధ్యను వివరణ కోరగా.. బాకారం, అజీజ్‌నగర్ గ్రామాల్లో ఇన్‌చార్జి పాలన సాగుతున్న విషయం నిజమేనన్నారు. ప్రభుత్వం పూర్తిస్థాయి అధికారులను ఎప్పుడు నియమిస్తే అప్పుడు ఈ గ్రామాలకు పూర్తిస్థాయి కార్యదర్శులు నియమితులవుతారని తెలిపారు. బాకారంలో బుధవారం గ్రామ పంచాయతీకి కార్యదర్శి రాలేదని ప్రజలు తెలిపారని అడగగా పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ లీవ్‌లో ఉన్నట్లు వివరించారు.



పంచాయతీ కార్యదర్శి సెలవు ఉండడంలో తాళం వేసి ఉన్న కార్యదర్శి రూమ్